

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి పేర్కొన్నారు. 8లో▸



కాంగ్రెస్ సత్తా చాటేలా..

లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల స్థానం నుంచి గెలుపు కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా ఉండాలని రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 8లో▸



బీజేపీతోనే దేశాభివృద్ధి

దేశ రక్షణ,అభివృద్ధికి బీజేపీతోనే సాధ్యమని పార్టీ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అంకిత భావంతో పని చేస్తానన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి గెలుపుకోసం కృషి చేస్తానన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు గాను రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తనిఖీల్లో పట్టుబడిన నగదుకు రశీదు ఇవ్వండి

షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధవరావు



ఎస్ఎస్‌టీ అధికారికి సూచనలు ఇస్తున్న ఆర్డీఓ

కేశంపేట: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన తనిఖీల్లో పట్టుబడిన నగదుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కొనాయపల్లిలో స్టాటికల్ సర్వేలైన్స్ బృందం(ఎస్ఎస్‌టీ) ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. తనిఖీ సమయంలో వాహనాల నంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం కొత్తపేటలో ఓటర్లకు ఆయన స్లిప్పులు అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ అజీంఅలీ, ఆర్ఐ నివేదిత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం

ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ సతీశ్

యాచారం: రోడ్లు భవనాల శాఖ నిధులతో చేపట్టే రోడ్ల అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే, బిల్లులు నిలిపేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ సతీశ్ హెచ్చరించారు. నందివనపర్తి గ్రామంలో ఆర్ అండ్ బీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ బోర్డు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డును నాణ్యత, క్యూరింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాశ్వతంగా ఉండే రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. నాసిరకమైన పనులు చేపడితే బిల్లులు నిలిపేయడంతో పాటు కాంట్రాక్టర్లు, పర్యవేక్షణ చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కందుకూరు- యాచారం గ్రామాల మధ్య నిర్మిస్తున్న కల్వర్టు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, ఉన్నతాధికారులు మధుసూదన్, రమణారెడ్డి, మహిపాల్ రెడ్డి, సీతారామయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ వద్ద లంచం తీసుకున్న కేసులో..

డిప్యూటీ తహసీల్దార్, రికార్డు అసిస్టెంట్‌పై వేటు

కొందుర్గు: పాత పహాణీ, ఆర్ఓఆర్‌లు ఇచ్చేందుకు లంచం తీసుకున్న డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్ సస్పెండ్ అయ్యారు. సోషల్ మీడియా పోస్టు ఆధారంగా విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు గురువారం ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ కాగా శుక్రవారం తహసీల్దార్ రమేశ్‌కుమార్ కిష్టయ్య, బాల్‌రాజ్‌లకు అందజేశారు. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన జవాన్ అశోక్ రెడ్డి తన తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి పాత రికార్డుల కోసం 2024 ఫిబ్రవరిలో కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. రోజులు గడిచినా అతడికి పాత రికార్డులు ఇవ్వలేదు. దీంతో ఆయన మార్చి 7న కార్యాలయానికి చేరుకుని రికార్డులు ఇవ్వాలని కోరగా ఇందుకు రూ.40 వేలు డిమాండ్ చేశారు. దీంతో అశోక్‌రెడ్డి అప్పట్లో కార్యాలయంలో పనిచేసే ప్రైవేట్ వ్యక్తి హేమంత్‌కుమార్‌కు ఫోన్‌పే నుంచిరూ.9వేలు, రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్‌కు కొంత నగదు ఇచ్చారు. ఈ విషయమై ఆర్మీ జవాన్ ఓ సెల్ఫీ వీడియోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. విచారణ చేసిన ఉన్నతాధికారులు ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సత్తాచాటిన చిలుకూరు విద్యార్థులు

జేఈఈ మెయిన్స్‌లో అద్భుత ఫలితాలు



కె.నవీన్ 90.69



కె.రమేష్ 87.49



డి.గోపిచంద్ 80.02



ఎస్.రాహుల్ 97.76



సంపత్‌కుమార్ 95.41



వి.ఋషి 94.10



అభిలాష్ 92.35

మొయినాబాద్: చిలుకూరు గురుకులం విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో అద్భుత ఫలితాలు సాధించారు. మండల పరిధిలోని చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులకు ఇంటర్‌తో పాటు ఐఐటీ శిక్షణ ఇచ్చారు. వీరిలో 30 మంది జేఈఈ మెయిన్స్ రాయగా 22 మంది అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ఇందులో ఎస్.రాహుల్ 97.76 పర్సంటైల్, వి.సంపత్‌కుమార్ 95.41, వి.ఋషి 94.10, ఇ.అభిలాష్ 92.35, కె.నవీన్ 90.69, కె.రమేష్ 87.49, డి.గోపిచంద్ 80.02 పర్సంటైల్ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.



అలైన్ ఫార్మా పరిశ్రమలో చెలరేగుతున్న మంటలు

నిర్లక్ష్యపు నిప్పు

- నందిగామ అలైన్ ఫార్మా పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం
- కోట్లల్లో ఆస్తినష్టం.. నలుగురు కార్మికులకు గాయాలు
- పరిశ్రమను సందర్శించిన డీసీపీ, ఎమ్మెల్యే



ఫైర్‌ఇంజన్ సాయంతో మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షాద్‌నగర్: పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల ప్రాణాలకు భరోసా లేకుండా పోతోంది. తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా యాజమాన్యాలు, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కార్మికుల శ్రమతో డబ్బు సంపాదిస్తున్న యాజమాన్యాలు కనీస భద్రత పాటించకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇదే నిర్లక్ష్యంతో గతంలో ఎన్నో ప్రమాదాలు సంభవించగా తాజాగా నందిగామ మండల కేంద్రంలోని అలైన్ ఫార్మసీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

తాడుసాయంతో బయటపడ్డ కార్మికులు

నందిగామ మండల కేంద్రంలో పాత జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న అలైన్ ఫార్మా హెర్బల్ పరిశ్రమలో హోమియోపతి మందులు తయారు చేస్తారు. సుమారు 70 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. ఈ పరిశ్రమలోని ఇనుప రేకుల షెడ్ కింద శుక్రవారం సాయంత్రం వెల్డింగ్ చేస్తుండగా నిప్పు రవ్వలు చెలరేగి స్పాంజ్, థర్మాకోల్ షీట్లపై పడి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో పలువురు కార్మికులు బయటకు పరుగులు తీశారు. మరికొందరు మంటలు వ్యాపించిన ప్రాంతం పక్కనే పరిశ్రమకు సంబంధించిన భవనం పై అంతస్తులోని కిటికీ నుంచి వచ్చారు. పరిశ్రమలో చిక్కుకున్న ఆరుగురు కార్మికులు తాడు సాయంతో బయటికి వచ్చారు. వీరిలో నలుగురు గాయపడ్డారు. నాలుగు ఫైర్ ఇంజన్‌ల సాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. నందిగామ సీఐ ప్రసాద్, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన కార్మికులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. పరిశ్రమలో సుమారు పది కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. పరిశ్రమ యజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం సంభవించిందని పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు పట్టక ప్రమాదాలు

నియోజకవర్గంలో కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో వందల సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. కానీ పలు పరిశ్రమల్లో కార్మికుల పరిరక్షణ కోసం యాజమాన్యాలు కనీస జాగ్రత్తలు పాటించడంలేదు. యంత్రాల మధ్య పని చేసే కార్మికులు రక్షణ పరికరాలను సమకూర్చడం లేదు. అనుభవం ఉన్న కార్మికులను విధుల్లో పెట్టుకుంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో అనుభవం లేని కార్మికులను పనిలో పెట్టుకోవడంతో ప్రమాదాలు జరిగి చనిపోతున్నారు. ప్రమాదాలు జరిగినా సంబంధిత పరిశ్రమల నిర్వాహకులు ఏమాత్రం బయటకు పొక్కనీయడం లేదు. పరిశ్రమల్లో భద్రతా అధికారి నిత్యం కార్మికుల భద్రత పై అవగాహన కల్పించాలి, ప్రమాదాలు జరిగే ఎలా నివారించాలన్న అంశం పై తరుచుగా ప్రదర్శనలు నిర్వహించాలని నిబంధనలు ఉన్న అవేవీ కనిపించవు. పరిశ్రమ శాఖ తరపున తనిఖీలు నిర్వహించడం లేదు. ఇకనైనా యాజమాన్య నిర్లక్ష్యాల పై అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

గుబులు పుట్టిస్తున్న వరుస ప్రమాదాలు

- 2012లో షాద్‌నగర్ శివారులో స్టీమ్‌కోర్ పరిశ్రమలో బాయిలర్ పేలి 12 మంది కార్మికులు మృతి
- 2015లో కొత్తూరు వినాయక స్టీల్ పరిశ్రమలో ఫర్నస్ పేలి పది మంది మృతి.
- తీగాపూర్ శివారులోని పాతటైర్లు కాల్చే పరిశ్రమలో బాయిలర్ పేలి నలుగురు మృతి
- నందిగామ పరిధిలోని శివశక్తి, జాగృతి, షాద్‌నగర్ పరిధిలోని ఎలికట్ట, మొగిలిగిద్ద శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో పదిమందికి పైగా కార్మికులు మృత్యువాత పడగా.. ఎంతో మంది క్షతగాత్రులయ్యారు
- ఎనిమిది నెలల క్రితం బూర్గుల పరిధిలోని కలర్లు తయారు చేసే పరిశ్రమలో ప్రమాదం జరిగి సుమారు ఐదు మంది కార్మికులు మృత్యువాత పడ్డారు.
- కొందుర్గు మండల శివారులోని స్పాంజ్ ఐరన్‌పరిశ్రమలో బాయిలర్ పేలి సుమారు పది మంది కార్మికులు గాయపడ్డారు.



కంపెనీ ఎదుట గుమిగూడిన మహిళా కార్మికులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

వికసిత్ చేవెళ్ల



సంకల్ప పత్రం విడుదల చేస్తున్న బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు

- 'సంకల్ప పత్రం' విడుదల చేసిన కొండా
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక మేనిఫెస్టో
- విద్య, వైద్యం, మౌలిక వసతులకు పెద్దపీట
- శాటిలైట్ సిటీ, వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'నాయకుడి కర్తవ్యం నాయకత్వం వహించడమే కాదు. అచంచలమైన అంకితభావంతో సేవ చేయడం. ప్రజల ఆకాంక్షలను ప్రతిధ్వనించడం, వారి భవిష్యత్ కోసం నిబద్ధతతో పని చేయడం. కానీ కొన్నేళ్లుగా అవినీతి, డబ్బుతో నడిచే రాజకీయాలను గమనిస్తున్నా. వాటికి పూర్తి భిన్నంగా ప్రజలకు సేవ చేయాలన్నదే నా సంకల్పం. ఆ మేరకు చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నీ తిరిగాను. ప్రతీ గడపను తట్టి ప్రజల గుండె చప్పుడు విన్నా. ఆ మేరకు ఆయా ప్రాంతాల అభివృద్ధే ఎజెండాగా ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించాను' అని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన మొయినాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సంకల్పపత్రం పేరిట రూపొందించిన ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఎంపీగా గెలుపొందితే.. రాబోయే ఐదేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి పనులను, ప్రజా సమస్యలకు చూపించే పరిష్కార మార్గాలను సంకల్పపత్రంలో వివరించారు. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, వికారాబాద్, పరిగి, తాండూరు, చేవెళ్ల ప్రాంతాలతో కూడిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సుస్థిరత, సమర్థత, సమగ్రత, ప్రగతి తో కూడిన ఉజ్వల భవిష్యత్తుకు ఈ సంకల్పపత్రం దోహదం చేస్తుందని చెప్పారు. ప్రతీ నియోజకవర్గంలోనూ నాణ్యమైన విద్య, వైద్య సేవలతో పాటు బయోగ్యాస్‌ను ప్రోత్సహించడం, సహజ వనరుల సంరక్షణ, మెరుగైన టౌన్ ప్లానింగ్, కమ్యూనిటీ సెంటర్లు, క్రీడా సౌకర్యాలు, లైబ్రరీలు తదితర సామాజిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిని ప్రోత్సహించనున్నట్లు వివరించారు. అదే విధంగా కొత్త ఎస్‌టీపీలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురానున్నట్లు ప్రకటించారు. సైబరాబాద్, హైదరాబాద్ తరహాలో భవిష్యత్ స్మార్ట్ శాటిలైట్ సిటీ వికారాబాద్ కోసం ఎఫెక్టివ్ టౌన్ ప్లానింగ్ చేపడతానని తెలిపారు. కేవీఆర్ భరోసా హాట్‌లైన్ ద్వారా వృద్ధులకు పెన్షన్ల పంపిణీ, సీనియర్ సిటీజన్ క్లబ్‌ల ఏర్పాటు, తీర్థయాత్రలకు చేయూత, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి, చేవెళ్లకు కాళేశ్వరం నీళ్ల తరలింపు. గండిపేట, హిమాయత్ సాగర్ సరస్సుల పరివాహక ప్రాంతం అభివృద్ధి వంటి హామీలు ఇందులో పొందుపర్చారు.

నియోజకవర్గాల వారీగా హామీలు

- తాండూర్‌లో పప్పు దినుసుల విప్లవం సృష్టించడం, నాపరాతి పరిశ్రమలకు సాంకేతికతను జోడించడం, మైక్రో సిమెంట్ ఫ్యాక్టరీల ఏర్పాటు, శివసాగర్, జుట్టుపల్లి, కొత్తపల్లి సరస్సుల అభివృద్ధి, తాండూరు నుంచి ముంబై-బెంగళూరు హైవేల అనుసంధానానికి కృషి, పరిగి-కృష్ణా రైలు మార్గాన్ని సులభతరం చేయడం. బషీరాబాద్-తాండూరు మధ్య లోకల్ ట్రైన్ కనెక్టివిటీని మెరుగుపరచడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల పెంపునకు కృషి.
- వికారాబాద్‌ను స్మార్ట్ శాటిలైట్ సిటీగా అభివృద్ధి, ఎంఎంటీఎస్ మార్గం పొడిగింపు, బుల్లెట్ రైలు ప్రతిపాదన, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి సరస్సులను టూరిజం హబ్‌గా అభివృద్ధి, నియోజకవర్గ వ్యాప్తంగా బయోగ్యాస్ నమూనా ప్రతిపాదన, నాణ్యమైన వైద్య సేవలు, విద్య కల్పనకు కృషి. మానవీయ, స్థిరమైన చర్యల ద్వారా కోతుల బెడద నుంచి రక్షణ, అనంతగిరి పరిరక్షణ ప్రాజెక్ట్, భవిష్యత్ తరాల కోసం సహజ వనరులు, జీవవైవిధ్య పరిరక్షణ
- పరిగిలోని లఖింపూర్, ముజాహిద్‌పూర్ల సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని సంరక్షించి పర్యాటకులను ఆకర్షించేలా ప్రచారం కల్పించడం, జూరాల నుంచి పరిగి వ్యవసాయ మండలాలకు సాగునీటిని తీసుకురావడానికి కాలువల అభివృద్ధి, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల ఏర్పాటు, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మహిళలకు టాయిలెట్ల నిర్మాణం
- చేవెళ్లను మిల్లెట్ హబ్ ఆఫ్ ఇండియాగా మార్చడం, హైవే రీ ఎలైన్‌మెంట్, సీతారాంపూర్ రామమందిరానికి సంబంధించిన 1,100 ఎకరాల భూ వినియోగాన్ని లీజు ప్రాతిపదికన భద్రపరచడం సంకల్పంగా ప్రకటించారు.
- మహేశ్వరం ఫార్మాసిటీలో స్థానికులకు ఉద్యోగాల కల్పనకు కృషి, షాహీన్ నగర్, బాలాపూర్, ఒమర్ కాలనీ, జల్‌పల్లి ప్రాంతాలలో డ్రైనేజీ, నీటి ఎద్దడి నివారణ
- రాజేంద్రనగర్‌లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్ (ఏఐఐఎంఎస్) స్థాపనకు కృషి.
- శేరిలింగంపల్లిలో స్థానిక కార్పొరేటర్లు, గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెన్షియల్ అసోసియేషన్లు తమ కమ్యూనిటీల నిర్వహణ, అభివృద్ధి కార్యకలాపాలను సమర్థవంతంగా అమలు చేయించడం, హెచ్ఆర్ఏ కింద 50శాతం తగ్గింపును క్లెయిమ్ చేయడంలో అవగాహన పెంచడంతో పాటు, హైదరాబాద్‌ను టాప్ ఇండియన్ మెట్రో సిటీస్ జాబితాలో చేర్చాలని ప్రతి పాదించడం, సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపన, సైబర్ సెక్యూరిటీ చర్యలను మెరుగుపరచడం, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం స్థిరమైన అభివృద్ధి, శక్తి సామర్థ్యం మరియు సాంకేతిక పురోగతిని నడపడానికి ఛార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడం, వంటి అంశాలను సంకల్ప పత్రంలోప్రకటించారు.

నామినేషన్ల పరిశీలన!

- కాసాని నామినేషన్‌పై అభ్యంతరాలు
- పార్టీ లీగల్ సెల్ హామీతో అనుమతి
- 64 మంది 88 నామినేషన్లు దాఖలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ స్థానానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను శుక్రవారం రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ దాఖలు చేసిన నామినేషన్ పత్రంలో ఓ కేసుకు సంబంధించిన వివరాలను దాచి పెట్టారని ఫిర్యాదు అందడం ఉత్కంఠకు దారి తీసింది. 2022 అక్టోబర్ నుంచి 2023 అక్టోబర్ వరకు ఆయన టీడీపీ తెలంగాణ అధ్యక్షుడిగా పని చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించగా, అదే పార్టీ లోని రెండు వర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఒక వర్గం..మరో వర్గంపై ఫిర్యాదు చేసుకుంది. ఫిర్యాదులో కాసాని పేరును సైతం చేర్చారు. ఈ అంశంపై ఓ వ్యక్తి రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం ఉత్కంఠకు కారణమైంది.అయితే.. పోలీసులు కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్‌లో ఆయన పేరు లేక పోవడంతో ఆయన ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో ఈ వివరాలను పొందుపర్చలేదు. అభ్యర్థి కాసాని సహా బీఆర్ఎస్ లీగల్ సెల్ బృందం రిటర్నింగ్ సెంటర్‌కు చేరుకుని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. చివరకు ఆయన నామినేషన్ ఆమోదం పొందినట్లు తెలిసింది. 18 నుంచి 25 వరకు మొత్తం 64 మంది 88 నామినేషన్లు దాఖలు చేయగా.. రిటర్నింగ్ అధికారులు ఒక్కో నామినేషన్‌ను నిశితంగా పరిశీలించారు. వివరాలు సరిగా లేని వారి నామినేషన్లను తిరస్కరించారు.

నామినేషన్ల వివరాలు

లోక్‌సభ స్థానం	అభ్యర్థులు	నామినేషన్లు	తిర్కరణ	ఆమోదం
చేవెళ్ల	64	88	17	47
భువనగిరి	61	-	10	51
మహబూబ్‌నగర్	41	42	7	35
నాగర్‌కర్నూల్	34	53	13	21

కాంగ్రెస్‌కు మెజార్టీ తీసుకురావాలి

- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేయాలని పిలుపు

మహేశ్వరం: లోక్‌సభ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి మెజార్టీ తీసుకురావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. నియోజకవర్గంలో ఈనెల 30, మే5న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం మండల పరిధిలోని తుక్కుగూడలో ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఈనెల 30న జల్‌పల్లి, మీర్‌పేట్, బడంగ్‌పేట్, ఆర్‌కే పురం, సరూర్‌నగర్ డివిజన్లలో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో.. అలాగే వచ్చేనెల 5న మహేశ్వరం, కందుకూరు, ఇమాంగూడ, తుక్కుగూడలో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే



సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

అన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి ఓటేసినట్లే అవుతుందన్నారు. ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేసితీరుతామన్నారు. త్వరలో అర్హులకు రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం, స్థలాల పంపిణీ, పట్టా కలిగిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సహాయం అందిస్తామన్నారు. పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పాండునాయక్, మాజీ ఎంపీటీసీ రాజు, రంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

యాచారం: పాముకాటుకు గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులామైలారంలో చోటు చేసుకుంది. పాలకం జంగయ్య(55) శుక్రవారం మధ్యాహ్నం తన వ్యవసాయ క్షేత్రంలో ఆకుకూరలు తెంపుతుండగా ఆకుకూరల్లో ఉన్న పాము.. జంగయ్యను కాటేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు జంగయ్యను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ జంగయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.

బైక్ నంబర్ ప్లేట్ మార్చి వినియోగం

సహకరించిన మరో ముగ్గురికి రూ.2వేల జరిమానా

ఆమనగల్లు: పాతసామాను కింద కొనుగోలు చేసిన బైక్.. రంగు, నంబర్‌ప్లేట్‌ను మార్చి దానిని ఇతరులకు అమ్మిన నలుగురికి ఆమనగల్లు ప్రథమ శ్రేణి న్యాయస్థానం జడ్జి రూ.2వేల చొప్పున జరిమానా విధించింది. వివరాలు.. 2021 సంవత్సరంలో ఆమనగల్లు పట్టణానికి చెందిన పాతసామాను కొనుగోలు చేసే ముజాహిద్.. గుర్తు తెలియని వ్యక్తి నుంచి బైక్‌ను కొనుగోలు చేశాడు. అనంతరం ఆ బైక్‌ను మహ్మద్ అఫ్సర్‌కు విక్రయించగా.. ఆమనగల్లుకు చెందిన ప్రేమ్‌కుమార్ మరొకరి సహాయంతో బైక్ రంగు, నంబర్ ప్లేట్‌ను మార్చి ఆ బైక్‌ను వినియోగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమనగల్లు పట్టణంలో ప్రేమ్‌కుమార్ ఆ బైక్‌పై తిరుగుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడనిఎస్‌ఐ బల్‌రాం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితులుగా ఉన్న ఆమనగల్లుకు చెందిన వసంత, మహ్మద్ అఫ్సర్, ప్రేమ్‌కుమార్, ముజాహిద్‌కు ఆమనగల్లు కోర్టు రూ.2 వేల చొప్పున జరిమానా విధించిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన అప్పటి ఎస్‌ఐ ధర్మేశ్, సాక్షులను త్వరితగతిన హాజరుపరిచిన ఎస్‌ఐ బల్‌రాం, కోర్టు కానిస్టేబుల్ శంకర్‌ను షాద్‌నగర్ ఏసీపీ అభినందించారు.

దైవచింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపల్లిలో శుక్రవారం బొడ్రాయి, బూర్జు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామ మాజీ సర్పంచ్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

డీసీపీ నారాయణరెడ్డి

కడ్తాల్: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన మైసిగండి, సాలార్‌పూర్, ఎక్వాయిపల్లిలో ఆయన పర్యటించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో చర్చించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్ పాటించని వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఎస్‌ఐ వరప్రసాద్ ఉన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి



కందుకూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు: ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్.. అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. అందరికీ ఓటర్ స్లిప్‌లు అందేలా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. వచ్చేనెల 1, 2వ తేదీల్లో జరిగే పీఓ, ఏపీఓ శిక్షణకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ తహసీల్దార్లు విజయలక్ష్మి, గోపాల్, మాధవిరెడ్డి, మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్లు చంద్రశేఖర్, రఘు, మహేశ్వరం, కందుకూరు ఎంపీడీఓలు శైలజారెడ్డి, సరిత, నాయబ్ తహసీల్దార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం..

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్‌అధికారి,ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలోకి ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం వస్తుందన్నారు. ఇబ్రహీంపట్నంలో పురుష ఓటర్లు 1,70,807 మంది, స్త్రీలు 1,68,499 మంది ఉండగా మొత్తం నియోజకవర్గంలో 3,39,341 మంది ఓటర్లున్నారని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ 343 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. అందులో 107 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం 172 ఇన్‌సైడ్ వెబ్‌కాస్టింగ్, 55 అవుట్‌సైడ్ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ ఓటింగ్ కోసం ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూం కూడా ఆర్డీఓ కార్యాలయంలోనే ఏర్పాటు చేశామని తెలిపారు. గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలోని పీజీ బ్లాక్‌లో ఈవీఎంల స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు, ఆగాపల్లి ఎక్స్‌రోడ్డు, కొత్తగూడెం చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో రూ.9,08,4,485 లక్షల నగదు పట్టుబడిందని, 2,027 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. రూ.1,67,09,550 లక్షల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేసి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఓటింగ్ కోసం 5 మహిళా పోలింగ్ స్టేషన్లు, వికలాంగులకు, యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలని కోరారు.

పోగొట్టుకున్న పర్స్ అప్పగింత

సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించిన పోలీసులు



బాధితుడికి పర్స్ అప్పగిస్తున్న పోలీసులు

ఆమనగల్లు: ఆమనగల్లు కూరగాయల మార్కెట్లో పర్స్ పోగొట్టుకున్న బాధితుడి పర్స్‌ను పోలీసులు వెంటనే గుర్తించి తిరిగి అప్పగించారు. వివరాలు.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండాకు చెందిన బిచ్యా శుక్రవారం ఆమనగల్లు కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు చేస్తుండగా తన పర్స్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. స్పందించిన పెట్రోల్ మొబైల్ కానిస్టేబుల్ శివకుమార్, సీసీ టీవీ ఇన్‌చార్జి కానిస్టేబుల్ రఘునాయక్ సీసీ కెమెరాల సహాయంతో పర్స్‌ను తీసుకున్న వ్యక్తిని గుర్తించి అతనివద్ద నుంచి పర్స్‌ను బాధితుడు బిచ్యాకు అందించారు. బాధితుడికి న్యాయం చేయడంతో పాటు, చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ శివకుమార్, రఘునాయక్‌ను ఎస్‌ఐ బల్‌రాం అభినందించారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటాలి

పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల స్థానం నుంచి గెలుపు కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా ఉండాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దోబిపేట గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు హస్తం గూటికి చేరారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి రంజిత్‌రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో గెలిచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కానుక అందించేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలన్నారు. కష్టపడిన వారికి భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. తన గెలుపు కోసం పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపుకోసం పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



చింతపట్లలో ప్రచారం చేస్తున్న బూర నర్సయ్యగౌడ్, నాయకులు

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటు వేసి వృథా చేసుకోవద్దు
- కమలంపువ్వు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే సేవకుడి పనిచేస్తా
- భువనగిరి లోక్‌సభ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

యాచారం: దేశ రక్షణ,అభివృద్ధికి బీజేపీతోనే సాధ్యమని పార్టీ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి,మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మొండిగౌరెల్లి, చింతపట్ల, నల్లవెల్లి, యాచారం తదితర గ్రామాల్లో పర్యటించారు. మోదీ చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలు ఇంటింటికీ పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటేసి వృథా చేసుకోవద్దన్నారు. ఆ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వచ్చేది లేదని, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే ప్రయోజనం ఉండదన్నారు. పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ గ్రామాల్లోని అభివృద్ధి పనులకు పైసా నిధులు మంజూరు చేసింది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, పల్లె ప్రగతి తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. కేసీఆర్ సర్కార్ నిధులు మంజూరు చేయకపోగా.. అప్పులు పాలైన ప్రజా ప్రతినిధులు ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శించారు. కమలం పువ్వు గుర్తుపై ఓటేసి తనను ఎంపీగా గెలిపిస్తే మీ సేవకుడిగా పనిచేస్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు సాధ్యం కాదన్నారు. పంట రుణమాఫీ, రైతుబంధు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయకుండా మరోసారి మోసం చేసేందుకు చూస్తోందన్నారు. ఈ ప్రచారంలో యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య, చింతపట్ల ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, మర్పల్లి మల్లేశ్, సందీప్‌కుమార్‌రెడ్డి, గొరిగే బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కొత్తూరు రైల్వే వంతెన వద్ద ఘటన

కొత్తూరు: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తూరు పట్టణంలోని రైల్వే వంతెన సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపిన వివరాలు.. కొత్తూరు సమీపంలోని రైల్వే వంతెన వద్ద పట్టాలపై ఓ మృతదేహం పడి ఉందని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ పురుషోత్తమ్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వేహెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా సుమారు 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తిని రైలు ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే అతడు మృతి చెందినట్లు వివరించారు. మృతిడి ఒంటిపై బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, బ్లాక్ కలర్ టీషర్టు ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన రైల్వేపోలీసులను సంప్రదించాలని కోరారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం

ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జిగా ముడిమ్యాలకు చెందిన వంగ శ్రీధర్ రెడ్డిని నియమిస్తూ చేవెళ్ల బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి సబితారెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ. పదవులు అనుభవించిన కొందరు నాయకులు వారి స్వార్థం కోసం పార్టీలు మారుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలలు దాటినా ఇంతవరకు ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలిపించుకొని కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న యూత్ నాయకులతో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్, యాదగిరి, శివప్రసాద్, శేరి రాజు, సాయినాథ్, రామగౌడ్, హన్మంత్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌దే

- ఆదివాసి కాంగ్రెస్ ఛైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్

మహేశ్వరం: గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని.. బీజేపీని మరోసారి గెలిపిస్తే వారు రిజర్వేషన్లు, మార్చేస్తారని ఆదివాసి కాంగ్రెస్ ఛైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన తుక్కుగూడలోని కేఎల్‌ఆర్ నివాసంలో మండల స్థాయి గిరిజన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ.. బీజేపీ దళిత, గిరిజనులకు వ్యతిరేకంగా పనిచేస్తోందన్నారు. గరీబీ హటావో నినాదంతో ఇందిరా గాంధీ గిరిజనులను ఆదుకుందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు గిరిజనులంతా ఏకతాటిపైకి వచ్చి పనిచేశారని అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లోనూ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. తండాల్లో ఆరు గ్యారంటీలపై ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ రఘునాయక్, జెడ్పీ ఛైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, ఎంపీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జిలు నేరేళ్ల శారద, నిజాముద్దీన్, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ఆదివాసి కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ అధ్యక్షుడు గణేష్ రాథోడ్, మాజీ ఎంపీపీ వి.పాండునాయక్, కాంగ్రెస్ గిరిజన నాయకులు నేనావత్ రాజు నాయక్, అంగోత్ కృష్ణా నాయక్, పాండు నాయక్, భాస్కర్ నాయక్, దశరథ నాయక్, విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.